ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుమరం భీం
జిల్లా వార్తలు

6

శుక్రవారం 6 డిసెంబరు 2024

అందని ఆసరా



- దరఖాస్తులు స్వీకరించి నెలలు గడుస్తున్నా కలగని మోక్షం
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు
- మండల కేంద్రాల్లో పోటెత్తుతున్న దరఖాస్తులు
- ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న విమర్శలు



దరఖాస్తు చేసుకోవడానికి ఎంపీడీఓ కార్యాలయంకు వచ్చిన ప్రజలు

చింతలమానేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పింఛన్లను పెంచడంతో పాటు కొత్త పింఛన్లను మంజూరు చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. అట్టహాసంగా తీసుకున్న దరఖాస్తులకు నేటికీ మోక్షం కలగడం లేదు. అవి ఇప్పుడు ఏ దశలో ఉన్నాయో తెలియని అయోమయ స్థితిలో దరఖాస్తుదారులు ఉన్నారు. ఇక కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారు ఎప్పుడు పింఛన్ వస్తుందోనని కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు..

వయస్సు మీద పడ్డవారు, వితంతువులు, వికలాంగులు, అర్హులైనవారు ఇప్పటికే దరఖాస్తులు చేసుకొని పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. సుమారుగా రెండున్నరేళ్ల నుంచి పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. చాలా మంది ఎంపీడీవో, మున్సిపల్, కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ధరఖాస్తులు సమర్పించి పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

వెలువడని ప్రకటన..

గతంలో ప్రతీనెలా కొత్త పింఛన్లు అమలు చేసే విధానం ఉండేది. రెండేళ్లుగా పింఛన్ల మంజూరుపై ఎలాంటి ప్రకటన రావడం లేదు. ప్రతీ నెలా అర్హులు దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు విచారణ చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో పక్కన పెడుతున్నారు. ఈ ఏడాది అక్టోబరులోనే నూతన పింఛన్ విధానం మొదలవుతుందని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. భార్యాభర్తల్లో ఎవరైనా ఆసరా పింఛన్ పొందుతూ చనిపోతే ఆ పింఛన్‌ను భాగస్వామికి బదిలీ చేస్తున్నారు. పోయిన ఏడాది నుంచి స్పౌజ్ పింఛన్ల ప్రక్రియ కొనసాగుతోంది. స్పౌజ్ పింఛన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే మరుసటి నెల నుంచే పింఛన్‌ను బదిలీ చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో సుమారుగా 6వేలపైనే దరఖాస్తులు చేసుకున్నారు.

జిల్లాలో ఇది పింఛన్ల పరిస్థితి..

జిల్లాలోని 15మండలాల పరిధిలోని 335గ్రామ పంచాయతీల్లో ఆసరా పింఛన్ల లబ్ధిదారులు 54,589 మంది ఉండగా, రూ.12,76,65, 936 రాష్ట్ర ప్రభుత్వం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా పోస్టల్ శాఖకు అందజే స్తోంది. బ్రాంచ్‌పోస్టు మాస్టర్ల ద్వారా ప్రతీనెలా 1వ తేదిన లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో వృద్ధులు 23,253 మంది, దివ్యాంగులు 5858 మంది, గీతా కార్మికులు 133మంది, ఒంటరి, వితంతువులు 21,612 మంది పింఛన్లు పొందుతున్నారు.

ఎలాగూ కొత్త పింఛన్లు ఇవ్వడం లేదన్న కారణంతో అర్హులుగా ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవడం లేదు. వారందరూ దరఖాస్తులు చేసుకుంటే సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నది. కొత్త పింఛన్లు, పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, ప్రభుత్వం నిర్ణయం మేరకు అర్హులైన ప్రతీఒక్కరికి అందజేస్తామని మండలాల అధికారులు చెబుతున్నారు.

అర్హులైన వారందరికి పింఛన్ మంజూరు చేయాలి..



నేను గతేడాది ప్రమాదవశాత్తు కాలు కోల్పోవడంతో దివ్యాంగుడినయ్యాను. సదరం సర్టిఫికేట్ తీసుకొని నెలలు గడుస్తున్నా దరఖాస్తులను స్వీకరించడం లేదు. వెంటనే సంబంధిత శాఖాధికారులు దరఖాస్తులను స్వీకరించి అర్హులైన వారందరికీ పింఛన్‌లు పంపిణీ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2000ఉన్న పెన్షన్ రూ.4000, దివ్యాంగులకు రూ.4000 నుంచి రూ.6000లకు పెంచాలి. అర్హులైన వారందరికీ పింఛన్‌లు అందజేసి ఆదుకోవాలి.

\- చౌదరి ఓంకార్, దివ్యాంగుడు

సమస్యల పరిష్కారానికి ఏకమవుదాం

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ఏకమవుదామని రాయిసెంటర్ అధ్యక్షుడు కోర్కెట జ్ఞానేశ్వర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రాయిసెంటర్‌లో ఆదివాసీసంఘాల నాయకులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల7న జిల్లాకేంద్రంలోని రాయిసెంటర్‌లో సమావేశం ఏర్పాటుచేస్తామన్నారు. ఆదివాసీల సమస్యలుసంక్షేమం అభివృద్ధిపై చర్చించడంతో పాటు ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని తమసమస్యలను విన్నవించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాకేంద్రంలో నిర్వహించే సమావేశానికి అన్నిసంఘాల నాయకులు, ఆదివాసీలు రావాలని కోరారు. సమావేశంలో నాయకులు అర్జున్, రఘు, చందన్, బాదీరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు వరం

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ఆర్టీసీ ఉద్యోగులతో కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు అందించిన ఉచితబస్సు ప్రయాణ సౌకర్యం వరమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ప్రజాపాలన ప్రజావిజయోత్సవాలలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీబస్‌డిపోలో ఏర్పాటుచేసిన ఉచిత బస్సు ప్రయాణం విజయోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా చేపట్టిన మహిళలకు ఉచితబస్సు ప్రయాణం గొప్ప అవకాశం అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా చేపట్టిన ప్రజాపాలనప్రజా విజయోత్సవాలను అధికారుల సమన్వయంతో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రయాణప్రాంగణంలో తాగునీరు, మూత్రశాలల ఏర్పాటుకుచర్యలు చేపట్టాలని, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా రాత్రిసమయంలో వెలుగులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపోమేనేజర్ విశ్వనాథ్, ఆర్టీసీఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా గుండా శ్యాం



గుండా శ్యాం

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా గుండా శ్యాం ఎన్నికయ్యారు. యువజన సంఘం ఎన్నికల్లో నిర్వహించిన ఆన్‌లైన్ ఓటు విధానంలో రెండువేల పైచిలుకు ఓట్లతో ప్రత్యర్థిపై గెలుపొందాడు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎమ్మెల్సీ దండె విఠల్, తిరుపతి అభినందించారు.

పదేళ్లలో సాధించని అభివృద్ధి పది నెలల్లో సాధించాం

- రాష్ట్ర ట్రైబల్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్

కౌటాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో సాధించని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పదినెలల్లోనే సాధించిందని రాష్ట్ర ట్రైబల్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ టి బెల్లయ్యనాయక్ అన్నారు. గురువారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని జగదాంబ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిపక్షాలు ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా సీఎం రేవంత్‌రెడ్డి వెనుకడుగు వేయకుండా ప్రజాపాలన సాగిస్తున్నారన్నారు. సమగ్ర సర్వేతో రాష్ట్ర ప్రజల స్థితిగతులు తెలుస్తాయని దీని ద్వారా ప్రజలకు ఏ రీతిలో మేలు చేయగలమని సీఎం సహామంత్రులు ఆలోచన చేస్తున్నారన్నారు. అనంతరం ఆయనకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ లెక్చరర్‌లు తమను రెగ్యులర్ చేయాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, అజ్మీరా శ్యాంనాయక్, నాయకులు గణపతి, పీసీసీ అర్షద్‌హుస్సేన్, విశ్వనాథ్, నానయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ



కాగజ్‌నగర్‌లో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుపర్చటం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆరుగ్యారంటీలను వెంటనే అమలుపర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి/సిర్పూర్(టి)/కౌటాల: బీజేపీరాష్ట్ర అధ్యక్షుడు పిలుపు మేరకు గురువారం కాంగ్రెస్‌పార్టీ ఏడాదిపాలన వైఫల్యం, 'ఆరు అబద్ధాలు.. 66మోసాల'పై చింతలమానేపల్లి, సిర్పూర్(టి) మండలాల్లో, గ్రామాల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. చింతలమానేపల్లిలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, పార్టీజిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, బీజేపీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చింతలమానేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బెజ్జూరు: మండలంలోని సలుగుపల్లిగ్రామంలో బీజేపీ జిల్లా అధ్య క్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌తో కలిసి మోటారు సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఆరుహామీలు.. 66మోసాల'తో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి ప్రజలను నట్టేట ముంచిందని ఆరోపిం చారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, మనోహర్‌గౌడ్, భిక్షపతి, దిలీప్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



కెరమెరిలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. గురువారం మండలంలోని సుల్తాన్‌గూడ మండల పరిషత్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు, కూరగాయలను పరిశీలించారు. అనంతరం రిజిస్టర్లను తనిఖీచేసి మరుగు దొడ్ల నిర్మాణపనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు సకలసౌకర్యాలతో నాణ్యమైనవిద్యభోజనం అందించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ డాటా ఎంట్రీని పరిశీలించారు. త్వరగా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో అంజద్‌పాషా, ఎంఈవో ప్రకాష్, డీటీ సంతోష్ తదితరులు ఉన్నారు.

కుటుంబ సర్వే వివరాలను త్వరగా ఆన్‌లైన్ చేయాలి..

జైనూర్: ఇటీవల నిర్వహించిన సమగ్ర కుటుంబసర్వే వివరాలను త్వరగా ఆన్‌లైన్ చేయాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ పనులను ఆయన గురువారం పరిశీలించారు. సర్వేఆన్‌లైన్‌లో తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. మండలంలోని శివనూర్, కొద్దుగూడ, భుసిమెట్ట క్యాంప్ గ్రామాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న మరమ్మతు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఇన్‌చార్జీ తహసీల్దార్ ఆడ బీర్షావ్, ఏపీవో మోహన్, సూపరింటెండెంట్, ఐటీడీఏ ఏఈ రాథోడ్ ఇందల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారం ఐఎన్‌టీయూసీతోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఇనుగాల శ్రీధర్

కాగజ్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు ఐఎన్‌టీయూసీ తోనే సాధ్యమవుతాయని ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సెక్రెటరి ఇనుగాల శ్రీధర్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్‌లో ఆయన మాట్లాడారు. ఆర్టిసన్ కార్మికులకు సర్వీస్‌రూల్స్ ఇప్పించేం దుకు కృషి చేస్తామన్నారు. వారికి త్వరలోనే గ్రేడ్‌చేంజ్ ప్రమోషన్ ఇప్పిస్తామన్నారు. అన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిసన్ కార్మికులుగా గుర్తించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్ నీలం ఐలేష్, కంపెనీ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, వర్కింగ్ ప్రసిడెంట్ తులసి, రాష్ట్రచీఫ్ వైస్‌ప్రసిడెంట్ రమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, ఎమ్మాజీ సతీష్, వర్కింగ్ ప్రసిడెంట్ శ్రీనివాస్, మంచిర్యాల జిల్లాఅధ్యక్షుడు బాపురెడ్డి, శ్రీనివాస్, రామకృష్ణ, రైస్, ఆశోక్, రాంచందర్, బుచ్చిబాబు, పాషా పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక..

జిల్లా ఐఎన్‌టీయూసీ తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం(రి.నెం.327) ఎన్నికలు నిర్వహించారు. జిల్లాఅధ్యక్షుడిగా చంద్రశేఖర్, జిల్లా సీనియర్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కందుల శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామకృష్ణ, జిల్లా కార్యదర్శిగా ఎమ్మాజీ సతీష్, ట్రెజరర్‌గా ఆశోక్ ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు



ఆత్రం సక్కు

ఆసిఫాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఆసిఫాబాద్ మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు మాజీఎంపీ సోయం బాపురావుతో కలిసి గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆత్రంసక్కు కాంగ్రెస్‌పార్టీ తీర్థం పుచ్చుకోవడంతో జిల్లాలో బీఆర్ఎస్‌కు మరోకోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. జిల్లాలో అత్యధికంగా ఉన్న ఆదివాసీల తరపున వాణి వినిపించే నాయకులు అధికారపార్టీలో లేకపోవడం పార్టీ బలోపేతం చేయడంపై అదిష్టానం దృష్టిసారించింది. దీంతో ఎమ్మెల్సీ దండె విఠల్ కాంగ్రెస్‌అధిష్టానాన్ని ఒప్పించడంతోఆత్రంసక్కుకాంగ్రెస్‌పార్టీలో చేరారు.

ప్రజలను భయబ్రాంతులకు గురి చేయవద్దు



జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్

ఆసిఫాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పులుల సంచారం నేపథ్యంలో స్పష్టమైన సమాచారాన్ని మాత్రమే ప్రజలకు తెలియజేసేందుకు కృషిచేయాలని జిల్లా అటవీశాఖాధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ ఒకప్రకటనలో తెలిపారు. తప్పుడు వదంతులతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలద్వారా వచ్చిన సమాచా రాన్ని ప్రచురించే ముందు అటవీ శాఖాధికారు లతో ధృవీకరించుకోవాలని కోరారు. తప్పుడు వార్తలు సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ చేస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్

- అర్హులైన పేదలకు లబ్ధిచేకూర్చడమే లక్ష్యం: సీఎం



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఆసిఫాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలు లబ్ధి పొందే విధంగా ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ పని చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం హైద రాబాద్ నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు, గృహ నిర్మాణ శాఖాధికారులతో కలిసి వర్చువల్‌విధానంద్వారా ఇందిరమ్మ ఇళ్ల మొబైల్‌యాప్‌ను ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీడియోకాన్ఫరెన్స్ హాల్‌నుంచి ఆసిఫాబాద్ డీఆర్వో లోకేశ్వర్‌రావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, గృహనిర్మాణ శాధికారి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజ

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్‌జడ్జి యువరాజ పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహల నిరోధకచట్టం, బాలకార్మికుల, తదితరచట్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలను నిరోధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్యవివాహం గురించి సమాచారం తెలిసినా సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నరహరి, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ అంజని దేవి, ప్రిన్సిపాల్ జంగు, సిబ్బంది పాల్గొన్నారు.

108వాహనంలో ప్రసవం



పుట్టిన బిడ్డను కుటుంబ సభ్యులకు అందజేస్తున్న 108 సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సాలెగూడ గ్రామానికి చెందిన గర్భిణీ బి వందన గురువారం 108లో ప్రసవించింది. గురువారం పురిటినొప్పులు అధికం కావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆమెను ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికమై 108లోనే పండంటి పాపకు జన్మనిచ్చింది. దీంతో వెంటనే ఈఎంటీ ప్రవీణ్‌యాదవ్, రజినీకాంత్, పైలెట్ నాగార్జున తల్లీబిడ్డలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారిద్దరు సురక్షితంగా ఉన్నారు.

చలో ఇంద్రవెల్లి సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్

ఆసిఫాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న ఆదివాసీ అస్తిత్వపోరు గర్జన సభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లాఅధ్యక్షుడు కోవవిజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆదివాసీల హక్కులసాధన కోసం ఇంద్రవెల్లిలో నిర్వహించే సభకు ఆదివాసీలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, రాజేశ్వర్, తుకారాం, భీంరావు, సోము,ధర్మ తదితరులు పాల్గొన్నారు.

దళారుల నుంచి పత్తి రైతులను కాపాడాలి

ఆసిఫాబాద్, డిసెం బరు 5(ఆంధ్రజ్యోతి): రైతులను దళారులు పత్తి పంటను తక్కువధరకు కొనుగోలుచేసి ముంచుతున్నారని వారిని కాపాడాలని సీఐటీయూ నాయకులు అన్నారు. రైతుల అమా యకత్వాన్ని ఆసరా చేసుకుని విచ్చలవిడిగా ఎలాంటి అనుమతులు లేకుండా కాంటాలు పెట్టి క్వింటాలుకు రూ.500నుంచి రూ.700తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం వారు డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజన్న, దినకర్, ఆనంద్‌కుమార్, రాజేందర్, కార్తీక్‌లు పాల్గొన్నారు.

సంఘ భవనానికి స్థలం కేటాయించాలి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గజ్జల లక్ష్మణ్, తదితరులు

కాగజ్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణ మున్నూరు కాపు కమ్యూనిటీ భవనానికి భూమిని కేటాయించాలని గురువారం సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాకు మున్నూరు కాపుసంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ ఎమ్మెల్యే హరీష్‌బాబు సిఫార్సు చేసిన లేఖను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి గోలెం వెంకటేష్, ఉపాధ్యక్షుడు అంగల తిరుపతి, మహేందర్, పెరక మహేష్, గోవిందుల రాజన్న పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

లక్షెట్టిపేటరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ స్టేజీ వద్ద బుధవారం రాత్రి కోళ్లవాన్ ఢీకొని సంబాల గ్రామానికి చెందిన రాళ్లబండి సురేందర్(33) అక్కడిక్కడే మృతి చెందాడు. సురేందర్ బైక్‌పై మంచిర్యాలలో ఉండే సోదరి వద్దకు వెళ్తుండగా ఎదురుగా మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపు వస్తున్న కోళ్ల వ్యాన్ ఢీకొంది. తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి వివాహం కాలేదు. మృతుడి తమ్ముడు సుధాకర్ ఫిర్యాదు మేరకు వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

గంజాయి పట్టివేత : ఒకరిపై కేసు నమోదు

చింతలమానేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. చింతలమానేపల్లి మండలం గంగాపూర్ సమీపంలోని ప్రాణ హిత కెనాల్ వద్ద రవీంద్రనగర్-1 గ్రామానికి చెందిన హరిదాస్ సర్దార్ అనే వ్యక్తి నిషేధిత గంజాయిని అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్నా రన్న సమాచారంతో సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడిలో హరిదాస్‌సర్దార్ వద్ద 181.30గ్రాముల గంజాయి లభించిందన్నారు. దీని విలువ రూ.6వేలు ఉంటుందన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకొని హరిదాస్ సర్దార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సిమెంటు లారీ బోల్తా

తాండూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయపల్లి గ్రామంలోని జాతీయ రహదారిపై గురువారం మహారాష్ట్ర నుంచి ఖమ్మం వెళ్తున్న సిమెంటు లోడు లారీ బోల్తా పడింది. క్లీనర్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిర్పూర్(టి), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) నుంచి మహా రాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 30క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. గురువారం తెల్లవారుజామున హుడ్కిలి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేపడుతుండగా వాహనంలో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం మహారాష్ట్రకు తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. బియ్యం, వాహనాన్ని సీజ్‌చేసి హుడ్కిలికి గ్రామానికి చెందిన కిర్మిరే తరుణ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా మేకలు, గొర్రెలు మృతి

చింతలమానేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రన్‌వెల్లి గ్రామంలో 20మేకలు, గొర్రెలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాయి. గ్రామంలోని దండిగ బాపు చెందిన 25గొర్రెలు, రాగుండి శంకర్‌కు చెందిన 4గొర్రెలు, భీం కర్ శంకర్‌కు చెందిన 7మేకలు, గొర్రెలు మేత కోసం వెళ్లగా ఇందులో 20 మృతిచెందగా మరో 16 ఆచూకీ తెలియరాలేదు. కొన్నిరోజులుగా ఈ ప్రాం తంలో పులి సంచరిస్తుండడంతో పులిదాడి చేసిందా అన్న వదంతులు వెలువడ్డాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖాధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి ఆ ప్రాంతంలో దాడికి పాల్పడిన జంతువు పాదముద్రలను పరిశీలించగా పులి, చిరుత పులి అడుగులకు సరిపోలేదన్నారు. ఇతర జంతువుల దాడిలో మృతి చెంది ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

దండేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. అతనిపై చర్యలు తీసుకోవాలని మహిళ కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. అనంతరం దండేపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

యువతి వివాహానికి ఆర్థికసాయం

మందమర్రి టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాకు చెందిన శిరీష వివాహం ఈనెల 11న జరగనుంది. విషయం తెలు సుకున్న అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు బండి సదానందం పెళ్లి దుస్తులు, ఆర్థిక సహాయం అందజేశారు. సదానందం మాట్లాడుతూ పేద కుటుంబం కావడంతో సహాయం చేశానని తెలిపారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): నాగసముద్రం గ్రామానికి చెందిన గూడ రాజశేఖర్- విజయ దంపతుల కూతురు సహస్ర వివాహానికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్‌రావు రూ.10వేల ఆర్థికసాయం చేశారు. పార్టీ కార్యకర్త కావడంతో ఎమ్మెల్యే ఆర్థికసాయం పంపించగా గురువారం గడ్డం త్రిమూర్తి, సిరికొండ నవీన్, లక్కా కుల సృజన్‌లు అందజేశారు. మాజీ సర్పంచు అనవేని ప్రేమలతిరుపతి, నాయకులు నవీన్, లక్ష్మణ్, దుర్గప్రసాద్, రాజేందర్‌రావులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ కార్యవర్గం


నయీం


శ్రీకాంత్

మందమర్రిటౌన్, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): చెన్నూరు నియోజక వర్గం యువజనకాంగ్రెస్ అధ్యక్షుడిగా ఊరు మందమర్రికి చెందిన నయీం, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ ఎన్నిక య్యారు. వారు మాట్లాడుతూ యువ జన కాంగ్రెస్ పటిష్టతే లక్ష్యంగా పని చేస్తామన్నారు. తమను గెలిపించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌నియోజకవర్గ వైస్‌ప్రెసిడెంట్‌గా లంబాడిపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్‌నాయక్ నియమితులయ్యారు. ఇటీవల జరిగిన ఆన్‌లైన్ ఎన్నికల్లో ప్రవీణ్ నాయక్‌ను ఎన్నుకున్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రానికి చెందిన ఆవిడపు రవితేజ కాంగ్రెస్‌యువజన ఉపాధ్యక్షుడిగా, నియోజకవర్గప్రధాన కార్యదర్శిగా అరకాల రమేష్‌లు నియమితులయ్యారు. వీరిని నియమిస్తూ కాంగ్రెస్ అధిష్టానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తామని తెలిపారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం

మందమర్రి టౌన్, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అనుబంధ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా జక్కిడి శివ చరణ్‌రెడ్డిని గురువారం యువజన కాంగ్రెస్ కార్యదర్శి మహంత్ అర్జున్ కుమార్ హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. ఆయనమాట్లాడుతూ నూతనఅధ్యక్షుడిగా నియమితులైన చరణ్‌రెడ్డి నేతృత్వంలో మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పని చేస్తామని తెలిపారు.

నేటి తరానికి ఇబ్రహీం ఆదర్శం


సన్మానిస్తున్న పాఠశాల నిర్వాహకులు

మందమర్రి టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మాఊరి సేవా సంఘం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఎండి ఇబ్రహీం సేవలు ఆదర్శమని శ్రీచైతన్య పాఠశాల నిర్వాహకులు పేర్కొన్నారు. బుధవారం ఇబ్రహీంను సన్మానించారు. ఆయన సొంత ఖర్చులతో పేదలకు సరుకులు అందిస్తున్న సేవలను కొనియాడారు.

ధాన్యం సేకరణ లక్ష్యం చేరేనా?



- ప్రభుత్వ లక్ష్యం 57వేల మెట్రిక్ టన్నులు
- ప్రస్తుతం కొన్నది కేవలం 703మెట్రిక్ టన్నులు

దహెగాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నవంబరు నెల ప్రారంభంలోనే ధాన్యం కొనుగోలుకేంద్రాలు ప్రారంభించారు. ధాన్యం సేకరణ అంతంత మాత్రమే సాగుతోంది. జిల్లాలోని 34 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో 57వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడాన్ని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో 36 వేల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం కాగా, 21వేల మెట్రిక్‌టన్నులు దొడ్డురకం ధాన్యం సేకరించుకోవాల్సి ఉంది. ప్రస్తుతం డిసెంబరు 5 వరకు 590మెట్రిక్ టన్నుల సన్నరకం, 113మెట్రిక్ టన్నుల దొడ్డురకం మొత్తం 703మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఎక్కువగా ప్రైవేటు వ్యాపారులు రైతుల కల్లాల వద్దుకే వెళ్లి తేమ, తాలు లెక్క చేయకుండా ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువకు కొనుగోలు చేస్తున్నారు.

అయితే ప్రభుత్వం సన్న రకానికి రూ.500 బోనస్ ఇస్తామని పేర్కొన్నా రైతులు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తాలు పేరుతో కోత విధిం చడం ఒక కారణమైతే, ప్రభుత్వం ఇస్తామన్న రూ.500 బోనస్ వస్తుందో రాదోనన్న భయం మరోవైపు. దీంతో రైతులు ప్రైవేటు వైపే మొగ్గు చూపుతున్నారు.

జిల్లాలో 15మండలాల్లో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు వ్యవసాయ పంపు సెట్ల ద్వారా 56వేలకు పైగా ఎకరాల్లో వరిపంటను సాగుచేశారు. దహెగాం మండలంలో అధికంగా 9850ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. దహెగాం మండలంలో అంకూర్‌సిరి 101, ఉశిసిరి 101, సోనమ్ 101, జైశ్రీరాం సన్నరకాల ధాన్యాన్ని 30శాతం మంది రైతులు సాగు చేసినట్లు ఏఈవోలు తెలిపారు. మండలంలో వరికోతలు 50శాతానికి పైగా పూర్తి అయ్యాయి.

సన్నాలకే వ్యాపారుల మొగ్గు..

తేమశాతం, తాలుపేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా రైతుల కల్లాలకే వెళ్లి సన్న రకం ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేస్తు న్నారు. సన్నరకాలు పచ్చివడ్లు రూ.2400 కొను గోలు చేయగా ఆరబెట్టిన ధాన్యాన్ని రూ.2750 చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

క్వింటాలు రూ.2700లకు అమ్మాను..

ఎస్‌కే అహ్మద్, రైతు



15ఎకరాల్లో సన్నరకం వరిధాన్యాన్ని సాగుచేశాను. అంకూర్ సిరి 101 ధాన్యాన్ని సాగుచేస్తే ఎకరానికి 20 క్విం టాళ్ల దిగుబడి వచ్చింది. వ్యాపారులు కల్లాల వద్దకు వచ్చి ఒక క్వింటాలుకు రూ.2700 చెల్లించి కొనుగోలు చేశారు. 300 క్వింటాళ్ల ధాన్యాన్ని అమ్మాను. కౌలుకు పోను మంచి ఆదాయం వచ్చింది.

రూ.2600లకు అమ్మాను..

కొండు సంతోష్, కౌలు రైతు



అయిదు ఎకరాలు కౌలుకు పట్టి సన్నాలు వరి పంట సాగు చేశాను. ఎకరానికి 18నుంచి 20క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పదిరోజుల క్రితమే వ్యాపారులకు రూ.2600లకు క్వింటాలు అమ్మాను. ఎలాంటి తేమశాతం, తాలు తరుగు లేకుండా వ్యాపారులు కొనుగోలు చేశారు. రెండో పంట విత్తనోత్పత్తి వరి సాగు చేస్తున్నా.

ట్రైబల్ కార్పొరేషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం


బెల్లయ్య నాయక్‌కు ఘన స్వాగతం పలుతుకున్న నాయకులు

కాగజ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ విజయోత్సవాల సందర్భంగా కాగజ్‌నగర్‌లో చేపట్టే వివిధ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌కు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, కౌన్సిలర్ లావణ్య శరత్, కార్యకర్తలు, నాయకులు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

వరికొయ్యలు కాల్చడం వల్ల దిగుబడి తగ్గుతుంది

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్


అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్

దహెగాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వరికొయ్యలు కాల్చడం వల్ల పంటదిగుబడి తగ్గిపోతుందని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని పంటపొలాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వరికొయ్యలను కాల్చడం వల్ల వాతావరణం కాలుష్యం పెరిగి విపరీతమైన వేడితో భూసారం దెబ్బతింటుందన్నారు. ముఖ్యంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషకపదార్థాల శాతం తగ్గి పంటదిగుబడి తగ్గుతుందన్నారు. ఆయన వెంట వ్యవసాయాధికారులున్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్


పెంచికలపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై కొమురయ్య

పెంచికలపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో బుధవారం ఉదయం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత గుడుంబా, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని అన్నారు. గ్రామంల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితవ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వాహనదారులు సరైనపత్రాలు కలిగిఉండాలని, మద్యం సేవించి వాహనం నడిపితేచర్యలు తప్పవని హెచ్చరించారు. పులి సంచారం ఉన్న నేపథ్యంలో చేను పనులకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

బెజ్జూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బారెగూడ, సలుగుపల్లి తదితర గ్రామాల్లో గురువారం వ్యవసాయాధికారి నాగరాజు ఎరువుల దుకాణాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణా ల్లోని స్టాక్‌రిజిస్టర్‌లను పరిశీలించారు. ఎరువుల దుకాణాల్లో అన్ని రకాల రిజిస్టర్‌లను తప్పనిసరిగా మెయింటెనెన్స్ చేయాలని సూచించారు. ఎరువుల విక్రయాలను తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎరువులు, మందులు విక్రయించిన సమయంలో రైతులకు తప్పని సరిగా రశీదులు ఇవ్వాలన్నారు.

చిందులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చింతలమానేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చిందు కళాకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని చిందోళ్ల పోరాట హక్కుల కమిటీ జిల్లా నాయకుడు రాజేశ్వర్ హైదరాబాద్‌లో ఎస్సీ వర్గీకరణ కమీషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ మోస్టుబ్యాక్‌వర్డ్ షెడ్యూల్ కాస్టుగా గుర్తించి వర్గీకరణ రిజర్వే షన్ ఏడు శాతానికి పెంచాలని కోరారు. ఆయనవెంట నాయకులు తిరుపతి, సారయ్య, తదితరులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

కాంగ్రెస్‌పార్టీ మండల యూత్ అధ్యక్షుడిగా లింగు

జైనూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ మండల యూత్ అధ్యక్షుడిగా మర్లావాయికి చెందిన మండాడి లింగును ఎన్నుకున్నట్లు మార్కెట్‌కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ గురువారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో మండాడి లింగు గ్రామాల్లో పార్టీ బలోపేతం కోసం కృషి చేశారని, దింతో ఆయనకు యూత అధ్యక్షుడిగా నయమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పెందూర్ ప్రకాష్, కనక గంగారాం, రాథోడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

కాగజ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలోకి బుధవారం మాజీసర్పంచి ఉమ్మెర లింగయ్య, గిరిజననాయకుడు సోయం చిన్నయ్య, పలువురు కార్యకర్తలు చేరారు. ఈ మేరకు రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్‌బెల్లయ్య నాయక్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండేవిఠల్, జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు.

మధ్యాహ్న భోజనాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

లింగాపూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనాన్ని పక్కడ్బందీగా అమలు చేయాలని మండల విద్యాధికారి ఎం శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన మండలకేంద్రంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులతో మధ్యాహ్న భోజన కార్మికులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు రుచికరమైన వంటలు, పాలు గుడ్లు ఎప్పటికప్పుడు పరిశీలించి వండిపెట్టాలని అన్నారు. వసతిగృహాల్లో, ఆశ్రమాల్లో విద్యార్థులు చలినుంచి రక్షణ కల్పించేందుకు దుప్పట్లు, వేడినీరు సౌకర్యం కల్పించాలని అన్నారు. ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యపరిస్థితులను గమనించాలని అన్నారు.

కేజీబీవీలో వైద్యశిబిరం

లింగాపూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం వైద్యాశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్‌వో దత్తరాం, అశోక్, ఏఎన్‌ఎం సంధ్య, సంతోష్, ఎస్‌వో ప్రసన్న భారతి, తదితరులు పాల్గొన్నారు.

వదంతులు నమ్మవద్దు

కెరమెరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పులి భయంతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. ఈ నేపథ్యంలో బీమన్‌గొంది గ్రామంలో ఎఫ్‌ఆర్వో మజారోద్దీన్ గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో పులి లేదని వదంతలను నమ్మవద్దన్నారు. నిర్భయంగా వ్యవసాయ పనులు చేసుకోవచ్చని అవగాహన కల్పిస్తున్నారు.



గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ఎస్‌ఆర్పీ3,3ఏగనుల్లో పనిచేస్తూ జనవరినుంచి నవంబరువరకు 85మస్టర్ల కంటే తక్కువగా పనిచేసిన వారికి గురువారం గనిలోని కాన్ఫరెన్స్ హాలులో అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉద్యోగి నిర్ణీత మస్టర్లు తప్పనిసరిగా పూర్తిచేయాలన్నారు. డిసెంబర్‌లో మస్టర్లను గమనిస్తామని తెలిపారు. విధులకు హాజరుకాకపోవడానికిగల కారణాలను వారి కుటుంబసభ్యులద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్పీ1,3 గ్రూపుఏజెంట్ వెంకటే శ్వర్లు, ఇన్‌చార్జి మేనేజర్ మహేందర్, సంక్షేమాధికారి ఎస్‌ఎండీ గౌస్‌పాషా పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

బెల్లంపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి స్ట్రక్చర్ సమావేశంలో కృషిచేస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డిసీతారామయ్య అన్నారు. గురువారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిసంస్థలో క్యాంటీన్‌లను సంస్థ నిర్వహించే విధంగా ఆహారపదార్థాలు నాణ్యతపెంచడంపై యాజమాన్యం అంగీకరించిందన్నారు. వేజ్‌బోర్డులో 11రకాల అలవెన్స్‌లు పెంచడంపై అంగీకారం కుదిరిందన్నారు. కార్మికులకు సొంతింటి పథకం కింద 250గజాల స్థలం ఇచ్చే విషయంపై సమావేశంలో మాట్లాడుతామన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్నాం

- మందమర్రిలో ఉద్యోగులకు పదోన్నతులు

మందమర్రి టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికుల ప్రయోజనాలే ఏకైక లక్ష్యంగా తమ యూనియన్ పని చేస్తుందని ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన కేకే5 గని వద్ద మాట్లాడుతూ మందమర్రి ఏరియాలో పెద్ద మొత్తంలో ఆయా వృత్తుల్లో యాక్టింగ్ చేసిన కార్మికులకు పదోన్నతులు ఇప్పించడంలో తామే ముందున్నామన్నారు. ఆయా వృత్తులకు సంబంధించి మస్టర్లు ఉండి పదోన్నతులు రాకపోతే తమ దృష్టికి తేవాలని అన్నారు. నాయకులు కూడా ఎప్పటికప్పుడు కార్మికులతో మమేకమై పని చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్, మేకల సంతు, తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి: సీఎండీ బలరాం


కార్మికులతో సీఎండీ బలరాం

శ్రీరాంపూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం అన్నారు. బుధవారం మూడో బదిలీలో ఆయన ఎస్‌ఆర్పీ3, 3ఏగనిని సందర్శించారు. అనంతరం కార్మికులతో మాట్లాడుతూ, తమకు కేటాయించిన పనిని తప్పక పూర్తి చేయాలన్నారు. 8గంటల డ్యూటీలో సమయాన్ని వృథా చేయవద్దన్నారు. సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఎస్‌ఆర్పీ1,3 గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్లు, ఏఐయూటీసీ ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

నాణ్యమైన సరుకులు అందించాలి..

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులకు నాణ్యమైన సరుకులు అందించాలని జీఎం (పర్సనల్-ఐఆర్‌పీఎం) కవితానాయుడు అన్నారు. గురువారం ఆమె శ్రీరాంపూర్ ఏరియాను సందర్శించారు. సింగరేణి సూపర్ బజార్‌కు వెళ్లి డివిజనల్ మేనేజర్ రాజుతోపాటు ఉద్యోగులతో మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులకు కావాల్సిన గ్యాస్, నిత్యావసర సరుకులను నాణ్యమైనవి అందించాలన్నారు. ఎవరికి, ఏది అవసరమో వాటినే తెప్పించి నిల్వచేయాలన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలోని క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. ఎలాంటి ఆహారం అందిస్తున్నారని వాకబు చేశారు. అనంతరం ఆమెను శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్వి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఉద్యోగులకు కావాల్సిన సదుపాయాలు, పదోన్నతులపై ఇరువురూ చర్చించారు. ఆయాకార్యక్రమాల్లో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారా యణ, డీజీఎంలు పి అరవిందరావు, అజయ్‌కుమార్, రాజగోపాల్, చిరంజీవులు, పర్సనల్ మేనేజర్ మూర్తి, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్ రావు, సీనియర్ పీవోలు కాంతారావు, శ్రీనివాస్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేయండి

- బెల్లంపల్లి జీఎం శ్రీనివాస్

రెబ్బెన, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కంపెనీ స్థాయి క్రికెట్ క్రీడాపోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ తెలిపారు. గురువారం గోలేటి భీమన్న స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 91వ వార్షిక సింగరేణి స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరు రీజియన్ పరిధిలోని క్రీడాకారులు ఇక్కడికి వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, సివిల్ ఎస్‌ఇ మదీన భాష, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలపై యాజమాన్యంతో అంగీకారం

శ్రీరాంపూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన హామీలపై ఇటీవల నిర్వహించిన స్ట్రక్చరల్ సమావేశంలో ఒప్పందం కుదిరినట్లు ఏఐటీయూసీ రాష్ట్రఅధ్యక్షుడు వి సీతారామయ్య తెలిపారు. ఆర్కే7 గనిపై గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనింగ్‌స్టాఫ్, సూపర్‌వైజర్లు, ట్రేడ్స్‌మెన్, ఈపీ ఆపరేటర్లు మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ అయితే వారికి సూటబుల్ జాబ్ ఇస్తారన్నారు. మారుపేర్లు, విజిలెన్స్ డిపెండెంట్ ఉద్యోగుల సమస్యలను సీఎండీతో జరిగే సమావేశంలో చర్చించి ఒప్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా పాల్గొన్నారు.

సింగరేణి డే ఏర్పాట్లపై సమీక్ష

రెబ్బెన, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి డే ఈ నెల 23న ఏర్పాట్లు చేయనుండటంతో అన్ని శాఖల అధిపతులతో బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ గురువారం సమీక్షా సమావేశం జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భగా మాట్లాడుతూ భీమన్న మైదానంలో లైటింగ్‌సిస్టం, బ్యాండ్‌సౌండ్ సిస్టం, కళాబృందాలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లు చేయాలన్నారు. హరితగృహాల ఎంపిక, దీపాలంకరణ పోటీల నిర్వహణపై వివరించారు.

పిల్లల ఆట వస్తువులు, గృహోపకరణాలు, తినుబండారాలు స్టాల్స్ ఏర్పాటు చేసేట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీర్ భీంరావు జాడే, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ఎస్‌ఇ మదీనా బాషా, పాల్గొన్నారు.

సార్టింగ్ సేవలు యథాతథం

3వ పేజీ తరువాయి

కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు గతంలో ఉన్న స్పీడ్ పోస్ట్ కార్యాల యం ఇతర పనులకు వినియోగిస్తుండగా, సార్టింగ్ ఆఫీస్‌లోనే స్పీడ్ పోస్ట్ సేవలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఒకే కార్యాలయంలో రెండు రకాల సేవలు అందుబాటులో ఉండనుండగా, వినియోగ దారులు రెండు వేర్వేరు పనులను ఒకేచోట నుంచి పూర్తి చేసుకునే వెసలుబాటు కలగనుంది.

ఉద్యోగ సంఘాల హర్షం

సార్టింగ్ ఆఫీస్ తరలింపు నిలిచిపోవడం, ఆరేళ్ల క్రితం తరలించిన స్పీడ్‌పోస్ట్ కార్యాలయం తిరిగి మంచిర్యాలకు వస్తుండటంతో తపాల శాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సార్టింగ్ కార్యాలయం తరలింపు తేదీలు నిర్ణయించడం, ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధమైన సమ యంలో వార్తా కథనం ప్రచురితం కావడం పట్ల వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాలు వెనక్కి రావడం హర్షణీయం

ఎండీ లతీఫ్, ఆర్ఎంఎస్ నాయకుడు, రిటైర్డ్ ఉద్యోగి



మంచిర్యాల నుంచి తరలిపోయిన రెండు పోస్టల్ కార్యాలయాలు వెనక్కి రావడం హర్షించ తగ్గ విషయం. వార్తా కథనంతో కార్యాల యాలు తిరిగి వచ్చేందుకు కృషి చేసిన ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు. కార్యాలయాలు తిరిగి రావడం వల్ల వినియోగదారులకు సకాలంలో సేవలు అందుతాయి. ముఖ్యంగా స్పీడ్ పోస్ట్ సేవల వల్ల ప్రజలకు మేలు కలుగుతుంది. కార్యాలయాలు తిరిగి రావడం వల్ల వినియోగదారులతోపాటు తపాలశాఖ ఉద్యోగులకూ అవస్థలు తప్పినట్లయింది.

దివ్యాంగులకు ఆటల పోటీలు



మాట్లాడుతున్న ఎంఈవో మల్లేశం

తాండూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం భవిత సెంటర్‌లో దివ్యాంగ పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో మల్లేశం, జిల్లా సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ మూర్తి, దామోదర్‌రెడ్డి, సుభాష్‌లు బహుమతులు అందించారు. అనంతరం వారు భవిత సెంటర్ విధుల గురించి వివరించారు. దివ్యాంగ పిల్లలు సెంటర్‌కు వచ్చేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. టీచర్లు వెంకటేశ్వర్లు, సతీష్, ఫిజియోథెరపిస్టు వెంకటేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామీణ క్రీడలు

జన్నారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామస్థాయిలో, 10, 11, 12 తేదీల్లో మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో ఓపెన్ టూ ఆల్, అథ్లెటిక్స్ అండర్ 18 పోటీలు నిర్వహిస్తామని ఎంఈవో ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పెన్షన్‌లపై ఆడిట్



పెన్షనర్ల నుంచి వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

హాజీపూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముల్కల్ల పంచా యతీ పరిధిలో గురువారం ప్రభుత్వం అందజేస్తున్న పెన్షన్‌లపై నేషనల్ ఇన్ఫ ర్మేటిక్ సెంటర్ నుంచి వచ్చిన అధికా రులు ఆడిట్ నిర్వహించారు. ముందుగా గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలిం చారు. అనంతరం ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకుంటున్న వారి ఇండ్లకు వెళ్లి వివరాలను తెలుసుకున్నారు. డీఆర్‌డీఏ అధికారి సదానందం, ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కారో బార్ సత్యం, పోస్టుమాస్టర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

భీమారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లి గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయ ఐదవ వార్షికోత్సవాన్ని గురువారం ఆలయ నిర్వాహకులు వుష్కమల్ల శ్రీనివాస్, పున్నం సాంబశివల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం, నవగ్రహ పూజ, అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎడ్ల శ్రీనివాస్, జరుపుల శ్రీనివాస్,పణి, చందు, దుర్గం శ్రీను పాల్గొన్నారు.

శివాలయంలో గీతా సప్తాహం



సత్సంగంలో పాల్గొన్న భక్తులు

శ్రీరాంపూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గీతా జయంతి సందర్భంగా కృష్ణాకాలనీ శివాలయం ప్రాంగణంలో ఉన్న గీతా ప్రసన్న నిలయంలో గురువారం గీతా సప్తాహం నిర్వహించారు. మురళీకృష్ణ దేవతల పూజ, అభిషేకం, అర్చన నిర్వహించారు. వారం పాటు శ్రీ మద్భగవద్గీత సత్సంగం అధ్యక్షుడు భక్త దాసరి రాజేశం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఉంటాయని, పదో తేదిన కుంకుమ పూజలు, 11న హోమగుండాలు, 18 అధ్యాయాలు గీతా పారాయణం, సంపూర్ణ హోమం, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో డీడీ ప్రసాద్, ఆర్. మల్లేష్, లక్ష్మీనారాయణ, సమ్మయ్య, రాజమౌళి, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు సహాయ సహకారాలు అందించడంలో, పోలీస్, రవాణ, అగ్నిమాపక శాఖల్లో అధికారులకు, సిబ్బందికి సహాయకులుగా పనిచేయడంలో హోంగార్డుల పాత్ర కీలకమైంది. శ్రమకు తగ్గ వేతనాలు, గుర్తింపు లేకున్నా, కుటుంబ పోషణ భారం వెంటాడుతున్నా బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ హోంగార్డులు ఆయా శాఖలకు తమ వంతు సహాయసహకారాలు అందిస్తున్నారు. నేడు హోంగార్డ్‌ల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...

శాంతిభద్రతల పరిరక్షకులు

హోంగార్డులు



- అమలుకానీ వేతన పెంపు హామీ
- చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు
- జిల్లాలో 258 మంది హోంగార్డ్‌ల సేవలు
- నేడు హోంగార్డ్‌ల దినోత్సవం

హోంగార్డు వ్యవస్థ ఆవిర్భావం

హోంగార్డు వ్యవస్థకు డిసెంబర్ 6వ తేదీ 1946లో బొంబాయి ప్రావిన్స్‌లో బీజం పడింది. అదే యేడాదిలో మతపరమైన అల్లర్లు జరగగా పోలీసులకు, పరిపాలనకు సహాయ సహకారాలు అందించేందుకు పౌర స్వచ్ఛంద దళంగా మొదటి హోంగార్డ్స్ యూనిట్ ఏర్పాటైంది. ఆ తర్వాత 1952లో హోం డిఫెన్స్ పేరుతో ఈ వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. అలా ఆవిర్భవించిన హోంగార్డ్‌లను ఆర్మీ, నేవి, వైమానిక దళాలకు, ఇండియన్ పోలీస్ సర్వీస్‌కు, రాష్ట్రాల్లోని సివిల్ డిఫెన్స్ సహాయకులుగా పనిచేసే స్వచ్ఛంద దళంగా వారి సేవలను వినియోగించుకుంటున్నారు. హోంగార్డ్స్ సేవలను గుర్తిస్తూ యేటా డిసెంబర్ 6న 'రైజింగ్ డే' గా ప్రకటించడంతో అప్పటి నుంచి దేశవ్యాప్తంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

హోంగార్డుల విధులు...

పోలీసు, రవాణా, అగ్నిమాపక శాఖలకు సహాయకులుగా పని చేయడంతో పాటు అంతర్గత భద్రతను నిర్వహించడంలో సహాయ సహకారాలు అందిస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సహాయం చేస్తుంటారు. దేశ రక్షణలో ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుసంధానించిన ప్రత్యేక పనుల కోసం ఉద్దేశించిన అత్యవసర దళంగా పనిచేస్తుంటారు.

అమలు కాని వేతనాల పెంపు హామీ

హోంగార్డుల సేవలను కీర్తిస్తూ వారికి పనికి తగిన వేతనాలను అందించేందుకు గత ప్రభుత్వం హామీ ఇవ్వడంతోపాటు 2021లో ఉత్తర్వులను జారీ చేసింది. ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న వారిని మూడు విభాగాలుగా విభజించి వేతన పెంపు చేసేందుకు జీవోను జారీ చేసినా అది అమలుకు నోచుకోలేదు. పర్మనెంట్ సిబ్బంది, అధికారులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారి ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. రోజుకు రూ.921 వేతనంతో నెలలో ఎన్ని రోజులు పనిచేస్తే అంత మొత్తాన్ని ప్రతీ నెల 5 నుంచి 10వ తేదీలోగా వేతనంగా పొందుతున్నారు.

జిల్లాలో 258 మంది హోంగార్డులు

జిల్లాలో 258 మంది హోంగార్డ్‌లు సేవలందిస్తు న్నారు. పోలీస్, ఆర్టీవో శాఖల్లో 251 మంది విధులు నిర్వహిస్తుండగా మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి యూనిట్లలో కొనసాగుతున్నారు. మిగిలిన ఏడుగురు అగ్ని మాపక శాఖలో సేవలందిస్తుండగా మంచిర్యాల ఫైర్‌స్టేషన్ పరిధిలో నలుగురు, జన్నారం ఫైర్ స్టేషన్ పరిధిలో ముగ్గురు విధులు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వం పర్మనెంట్ చేస్తుందని ఆశిస్తున్నాం

ఆడెపు సురేష్ (హోం గార్డ్స్ ప్లాటూన్ కమాండర్, బెల్లంపల్లి)



పోలీస్ శాఖలో పలు రకాల సేవలందిస్తున్న హోంగార్డులను రాష్ట్ర ప్రభు త్వం పర్మనెంట్ చేస్తుందని ఆశిస్తున్నాం. వేతనాల పెంపు, సెలవులు, హెల్త్ కార్డు మంజూరు చేయడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ సభ్యులు ముఖ్యమంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరిస్తుందని భరోసాతో ఉన్నాం.

సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం వేతనాలు చెల్లించాలి

కనవేణి రాజు (హోం గార్డ్స్ ప్లాటూన్ కమాండర్, మంచిర్యాల)



చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులకు సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. గత ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి పరిష్కరించలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా హోంగార్డుల శ్రమను గుర్తించి సమస్యలను పరిష్కరించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలి.

న్యూస్ బాక్స్

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కళాకారులు

జన్నారం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం జరిగిన నిరుద్యోగుల కళాకారుల ఆత్మీయ సమ్మేళనంలో మంచిర్యాల జిల్లా నిరుద్యోగ కళాకారులు పాల్గొన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సాంస్కృతిక సారధి రాష్ట్ర అధ్యక్షురాలు వెన్నెలగద్దర్‌ను కళాకారులు సన్మానించారు. అర్హత గల నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని మంత్రి తెలిపినట్లు పేర్కొన్నారు. కళాకారులు కొండుకూరి రాజు, ఆకుల నర్సయ్య, సత్తయ్య, కిషన్, వెంకటేష్, రవికుమార్, శారద, ఝాన్సీరాణి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

8న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభ

గర్మిళ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలోని తాపీ సంఘం భవనంలో ఈ నెల 8న నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ జిల్లా 5వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనకు పలు తీర్మానాలను చేస్తామన్నారు. ఉపాధ్యాయులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

తాండూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కిష్టంపేట గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ చల్లూరి మల్లయ్య సతీమణి అంగన్‌వాడీ టీచర్ చల్లూరి శాంత అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శాంత గురువారం ఉదయం మృతిచెందారు. ఆమె మృతదేహానికి సీడీపీవో స్వరూపరాణి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి కొండు బానేష్, రైతు సంఘం నాయకులు దుర్గయ్య, సన్యాసి, రాజలింగులు పరామర్శించి ఓదార్చారు.

చెన్నూరులో వసతి గృహాలను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చెన్నూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులో ఎస్సీ బాలికలు, బాలుర కళాశాలల వసతి గృహాలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజులు పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో సుమారు 900 మంది విద్యనభ్యసిస్తున్నారన్నారు. భీమారం, కోటపల్లి, వేమనపల్లి, చెన్నూరు మండలాల నుంచి విద్యార్థులు వస్తున్నారని, వసతి గృహాలు లేకపోవడంతో గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు సమయానికి రాలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెన్నూరులో వసతి గృహాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బంది ఉండదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వసతి గృహాలను ఏర్పాటు చేయాలని కోరారు. లక్ష్మణ్, రవీందర్, గణేష్, విజయ్‌కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకుల వద్ద పరిశుభ్రంగా ఉంచాలి

జైపూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్ పేర్కొన్నారు. గురువారం మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను సందర్శించారు. వారు మాట్లాడుతూ ట్యాంకుల వద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని కార్యదర్శులకు సూచించారు. మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలోని డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా నిర్మాణం చేపడుతున్న సైడ్ డ్రైనేజీలను పరిశీలించారు. నాణ్యతతో పనులను చేపట్టాలని సూచించారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, కార్యదర్శి ఉదయ్‌కుమార్ ఉన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన





ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్, అర్బన్ పార్కులో పర్యటిస్తున్న విద్యార్థులు

చెన్నూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివలింగాపూర్ గ్రామంలో గురువారం ఫారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్ వన్యప్రాణుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని, విద్యుత్ వైర్లు, ఉచ్చులు, ఉరులు బిగించి వన్యప్రాణులను చంపితే కఠినచర్యలు తీసుకొంటామన్నారు. అడవులను, వన్యప్రాణులను అందరు సంరక్షించాలన్నారు. మాజీ ఉపసర్పంచు సంపత్, బేస్ క్యాంపు సిబ్బంది, వాచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

మండలంలోని కిష్టంపేట గ్రామ సమీపంలోని అర్బన్ పార్కు (వన విహార్)ను పట్టణంలోని వాగ్దేవి పాఠశాల విద్యార్థులు సందర్శించారు. అటవీ శాఖ అధికారులు వన విహార్ గురించి వివరించారు. సీతాకోక చిలుకలు వాటి పేర్లు, వివిధ రకాల పక్షులు, మొక్కల గురించి తెలిపారు. అకిరామియావాకి అడవి గురించి వివరించారు. ఎఫ్ఆర్వో శివకుమార్, సెక్షన్ అధికారి అంజయ్య, ఎఫ్‌బీవోలు జ్యోతి,సంధ్య పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

జన్నారం, (ఆంధ్రజ్యోతి): అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని ఉప అటవీ క్షేత్రాధికారి రాము పేర్కొన్నారు. గురువారం సింగారాయిపేట, దొంగపల్లి గ్రామాల్లోని ప్రజలకు అటవీ సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలు పంట పొలాల్లో, వ్యర్థాలకు నిప్పు పెట్టినప్పుడు నిప్పురవ్వలు అటవీ ప్రాంతంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తునికాకు సేకరణకు వెళ్లినప్పుడు ఎండిన ఆకులకు నిప్పు పెట్టవద్దని, బీడీలు, సిగరెట్లు కాల్చి పడేయవద్దని సూచించారు. వన్యప్రాణులు, అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఎఫ్ఎస్‌వో అజమత్, ఎఫ్‌బీవో కృష్ణ చైతన్య, రాజు, సంతోష్ పాల్గొన్నారు.

కుశ్నపల్లిలో పంటకోత ప్రయోగం



కోతల తరువాత ధాన్యం తూకం వేస్తున్న అధికారులు

నెన్నెల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగు చేసిన పంట ఉత్పత్తుల దిగుబడి అంచనాలు రూపొందించేందుకు అధికారులు గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు చేస్తున్నారు. బెల్లంపల్లి డివిజన్ గణాంకాల అధికారి గురువయ్య ఆధ్వర్యంలో కుశ్నపల్లిలో గురువారం వరి పొలాల్లో పంటకోత ప్రయోగాలు చేశారు. ఓ రైతు పొలంలో కొంత విస్తీర్ణం వరి పొలాన్ని కోసి నూర్పిడి చేశారు. వచ్చిన ధాన్యాన్ని తూకం వేశారు. పంటకోత ప్రయోగాల ద్వారా ఈ ప్రాంతంలో సాగు చేసిన పొలాల్లో వచ్చే సరాసరి దిగుబడిని లెక్క కడతామని అధికారులు చెప్పారు. రైతుల ఆదాయం తెలుసుకొని రాష్ట్ర జీడీపీకి వ్యవసాయ రంగం నుంచి ఎంత ఆదాయం సమకూరుతుందో లెక్కగడతారని అధికారులు పేర్కొన్నారు. ఎంపీఎస్‌వో అశోక్, నెన్నెల ఏఈవో రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



సండ్రోన్‌పల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి కల్పన

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకుని సండ్రోన్‌పల్లి రైతువేదికలో భూసార పరీక్షలపై గురువారం జిల్లా వ్యవసాయాధికారి కల్పన అవగాహన కల్పించారు. నేలలో సేంద్రియ కర్బన శాతం పెంపొందించుకునేందుకు ఎలాంటి పద్ధతులు అవలంభించాలి, భూపరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలని రైతులకు వివరించారు. ఆమె మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు వాడడం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడి పంటలను సాగు చేయాలన్నారు. సేంద్రియ ఎరువులతో నేల సారవంతమవుతుందన్నారు. రసాయన ఎరువులతో భూసారం తగ్గుతుందన్నారు. ఏడీఏ భానుప్రసాద్, మండల వ్యవసాయాధికారి కిరణ్మయి, ఏఈవోలు తిరుపతి, కనకరాజు, పాల్గొన్నారు.

జన్నారం, (ఆంధ్రజ్యోతి): పొనకల్ రైతువేదికలో ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. ఏఈవో త్రిసంధ్య మాట్లాడుతూ రైతులు అధికంగా ఎరువులు, పురుగుల మందుల వాడడంతో నేలలో జీవరాశులు నశించిపోతున్నాయని తెలిపారు. నేల సారవంతంగా ఉండాలంటే సేంద్రియ ఎరువులను వాడాలని, భవిష్యత్‌తరాలకు సారవంతమైన భూమిని అందించడానికి ప్రతీ రైతు కృషి చేయాలని కోరారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ ఎరువులనే వాడాలని మండల వ్యవసాయాధికారి సుష్మ అన్నారు. కొత్తపల్లి రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు రసాయన ఎరువులను వాడకుండా జీలుగా, పెసర, పచ్చిరొట్ట విత్తనాలు వాడడం ద్వారా నేల సారవంతం అవుతుందన్నారు. ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): నేల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ గౌరవాధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు నేల రక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు సేంద్రియ ఎరువులను వాడితే నేల సారవంతంగా ఉంటుందన్నారు. భావితరాలకు సారవంతమైన నేలను అందించాలంటే రసాయన ఎరువులు తగ్గించాలన్నారు. పుస్కూరి శ్రీనివాసరావు, శంకర్ పాల్గొన్నారు.

గుడిపేట రైతువేదికలో మండల వ్యవసాయాధికారి కృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో మట్టి నమూనాలను సేకరించి ఆదిలాబాద్‌లోని పరీక్ష కేంద్రానికి పంపిస్తామన్నారు. పోషక లభ్యత, ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం మోతాదును రైతులకు తెలియజేస్తామన్నారు. రైతులు రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. ఏఈవోలు కొమురయ్య,మౌనిక, ప్రసన్న పాల్గొన్నారు.


నెన్నెల, (ఆంధ్రజ్యోతి): నెన్నెల, జోగాపూర్, చిత్తాపూర్ రైతువేదికల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. నేలలోని సహజత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. భూసార పరీక్షలు చేసుకొని అవసరమైన ఎరువులను మాత్రమే వాడాలన్నారు. పంట మార్పిడి చేస్తూ సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. ఏఈవోలు రామ్‌చందర్, సుప్రజా, మౌనిక పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా రైతువేదికలో రైతులకు నేలపై మండల వ్యవసాయాధికారి సుధాకర్ అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు అధికంగా ఉండడం వల్ల నేల స్వభావం మారిపోతుందన్నారు. తెలంగాణలో 22 రకాల నేలలు ఉన్నాయని రైతులకు తెలిపారు. నీటి విలువ సామర్థ్యం, పోషకాల లభ్యత నేల స్వభావాన్ని బట్టి ఉంటుందన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): ప్రపంచనేల(మృత్తికా) దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో రైతువేదికలో వ్యవసాయాధికారి ప్రేమలత సమక్షంలో ఏడు మండలాలకు చెందిన ఏఈవోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మట్టి నమునాలు పొలం నుంచి ఎలా సేకరించాలని, నమునాలను ఎలా తయారు చేయాలని, మట్టిపరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల మోతాదు రైతులకు సిఫారసు అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏఈవోలు అంజన్న, ఘన్‌శ్యాం, కవిత, కల్పన, అధిత్యవర్ధన్, సిద్ధార్థ, రష్మిత, రైతులు పాల్గొన్నారు.



హాజీపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు



న్యూస్ బాక్స్


నేటి నుంచి పత్తి కొనుగోళ్లు నిలిపివేత

తాండూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపల్లెవాడ వద్ద గల మహేశ్వరి, శ్రీరామ జిన్నింగు మిల్లుల్లో ఈ నెల 6 నుంచి 8 వరకు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాక్టరీల్లో పత్తి, పత్తి గింజల నిల్వలు ఎక్కువైనందున కొనుగోళ్లు జరగవని తెలిపారు. 9వ తేదీ నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు.

పనులకు భూమి పూజ


పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత

బెల్లంపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 14, 27 వార్డుల్లో గురువారం సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత భూమి పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అన్ని వార్డుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కౌన్సిలర్ నారాయణ, నాయకులు రవి, సుశీల, హేమలత, సాయి, రమాకాంత్, మున్సిపల్ డీఈ సాయికిరణ్, ఏఈ అశ్రిత్ పాల్గొన్నారు.



సార్టింగ్ సేవలు యథాతథం

- కార్యాలయం తరలించే యోచన రద్దు
- తిరిగి రానున్న స్పీడ్ పోస్ట్ ఆఫీస్
- ఎప్పటిలాగే రిజిస్టర్డ్, ఆర్డినరీ పోస్టల్ సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మంచిర్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రైల్వే మెయిల్ సర్వీస్ (ఆర్ఎంఎస్) సార్టింగ్ ఆఫీస్‌ను ఇక్కడి నుంచి తరలించే యోచనను పోస్టల్‌శాఖ ఎట్టకేలకు రద్దు చేసుకొంది. ఈ నెల 7న కార్యాలయం తరలి పోనుండగా, గురువారం ఆ ప్రయత్నాన్ని విరమించుకుంటున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కార్యాలయం తరలింపుతో ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో 'సార్టింగ్ ఆఫీస్ తరలిపోతోంది..?' శీర్షిక న నవంబరు 23న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. కథనం సారాంశాన్ని, తమ బాధలను పోస్టల్ ఉద్యోగులు ఆ శాఖ ప్రధాన కార్యాలయానికి మెయిల్ ద్వారా పంపడంతో పునరాలోచించిన ఉన్న తాధికారులు తమ నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఈ మేరకు కార్యాలయాన్ని జిల్లా కేంద్రంలోనే కొనసాగిస్తూ ఢిల్లీలోని డాక్ భవన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆఫీస్‌ను కాజీపేటలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌హెచ్ కార్యాలయానికి తరలించే ప్రయత్నాలు జరగగా, ఆంధ్రజ్యోతి కథనంతో రద్దు అయ్యాయి. ఒకవేళ సార్టింగ్ ఆఫీస్‌ను తరలిస్తే పోస్టల్ సేవలకు కనీసం రెండు మూడు రోజులు వేచి చూసే పరిస్థితులు ఉండేవి. ఉన్నతాధికారుల తాజా నిర్ణయం మేరకు ఇకమీదట 24 గంటలలోపే రిజిస్టర్డ్, ఆర్డినరీ పోస్టల్ సేవలు అందనున్నాయి.

తిరిగి రానున్న స్పీడ్ పోస్ట్ కార్యాలయం

గతంలో మంచిర్యాల నుంచి తరలి పోయిన స్పీడ్ పోస్ట్ కార్యాలయం కూడా తిరిగి వెనక్కి రానుంది. ఈ మేరకు గురువారం జారీ అయిన ఉత్తర్వుల్లో పోస్టల్ శాఖ ఈ విషయాన్ని పేర్కొంది. గతంలో స్పీడ్ పోస్టు కార్యాలయాన్ని సైతం కాజీపేటలోని ఎస్ఎస్‌హెచ్‌కు 2018లో తరలించడంతో ప్రస్తుతం అక్కడి నుంచే ఉత్తరాలు పంపిణీ అవుతున్నాయి. స్పీడ్ సేవలు అందుబాటులో ఉన్నప్పుడు 24 గంటలలోపు సేవలు అందేవి. ప్రస్తుతం మూడు, నాలుగు రోజుల సమయం పడుతోంది. ప్రస్తుతం స్పీడ్ పోస్ట్ కార్యాలయం కూడా వెనక్కి వస్తుండడంతో 24 గంటల సేవలు పునరుద్ధరణ కానున్నాయి. ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో జనాదరణ ఉన్నచోట గతంలో తరలించిన స్పీడ్ పోస్టు సేవలను ప్రస్తుతం కొనసాగుతున్న రిజిస్టర్, ఆర్డినరీ సేవలు అందిస్తున్న సార్టింగ్ కార్యాలయాల్లోనే

మిగతా 5వ పేజీలో..

ధాన్యం సేకరణ లక్ష్యం చేరేనా?

- ప్రభుత్వ లక్ష్యం 57వేల మెట్రిక్ టన్నులు
- ప్రస్తుతం కొన్నది కేవలం 703మెట్రిక్ టన్నులు


4

శాంతిభద్రతల పరిరక్షకులు హోంగార్డులు

- అమలుకానీ వేతన పెంపు హామీ
- చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు
- జిల్లాలో 258 మంది హోంగార్డ్‌ల సేవలు
- నేడు హోంగార్డ్‌ల దినోత్సవం


5

కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ నిరసనలు


రాస్తారోకో పాల్గొన్న కొట్నాక తిరుపతి, గడ్డం త్రిమూర్తి తదితరులు

లక్సెట్టిపేటరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : లక్సెట్టిపేట పట్టణంలోని ఉత్కూరు చౌరస్తాలో మోదీ మోసం దేశం ఆగం పేరుతో కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ 11 సంవత్సరాల కాలంలో బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి నెరవేర్చలేదన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ దేశాన్ని నాశనం చేయాలని ప్రధాని కుట్రలు చేస్తున్నాడన్నారు. బీజేపీ నాయకులకు ప్రజల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లో లోపాయికారి ఒప్పందం చేసుకుని అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో అభివృద్ధికి వ్యతిరేకంగా బీజేపీ నాయకులు ఏ నిరసనకు దిగినా కౌంటర్ ఇస్తామని పేర్కొన్నారు. సాధ్యమైతే అభివృద్ధిలో పాలు పంచుకోవాలి కాని అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకోమని హెచ్చరించారు. రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి, జిల్లా నాయకులు గడ్డం త్రిమూర్తి, పింగళి రమేష్, నాగభూషణం, పూర్ణచందర్‌రావు, శ్రీనివాస్,రాజేందర్, రాజు, శ్రీనివాస్, మాజీ ఎంపీటీలు, మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, తదితరులు

ఉత్కూరు చౌరస్తాలో రైతులతో కలిసి రైతుగోస పేరిట నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వెళ్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లిని పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ రహదారిపై బైఠాయించారు. రఘునాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిరసన కార్యక్రమం చేపడితే అడ్డుకోవడం సరైంది కాదన్నారు. ఎమ్మెల్యే ఒత్తిడితోనే పోలీసులు అడ్డుకోవడం అమానుషమన్నారు. ప్రజల పక్షాన ప్రతిపక్ష పార్టీ పోరాడుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామని ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, గాదె శ్రీనివాస్, ఎనగందుల కృష్ణమూర్తి, వెంకటరమణరావు, వెంకటకృష్ణ, మధు, రాజన్న, హరిగోపాల్, శ్రీదేవి,ప్రభాకర్, గురువయ్య,తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో కలెక్టరేట్


మాట్లాడుతున్న రామ్‌ప్రసాద్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించి ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తున్నట్లు నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్‌ప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో యేండ్లుగా విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేస్తుందన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఫీజు బకాయిలను విడుదల చేయాలనే డిమాండ్‌తో ముట్టడిని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆమోఘ్, విష్ణు, తిరుపతి, మహేష్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై పట్టింపు లేని ప్రభుత్వం

తాండూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చదువుకునే విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గురువారం వారు మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్‌తో రాష్ట్రంలో పలువురు విద్యార్థులు మృతిచెందారన్నారు. కేసీఆర్ హయాంలో వెయ్యికి పైగా గురుకులాలను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో అవి భ్రష్టుపట్టిపోయాయన్నారు. చలికాలంలో విద్యార్థులకు దుప్పట్లు లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూసల ప్రణయ్, నాయకులు చైతన్య, చింటూ, శ్రీకాంత్, సారయ్య, అరుణ్, సాయి,లతీఫ్, రాకేష్,జగన్, వెంకటేష్, షారుక్, ముసవీర్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): తాండూర్‌లోని మహాత్మాజ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల ఎదుట బీఆర్ఎస్వీ నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. పాఠశాల సందర్శనకు వెళ్లిన నాయకులను సిబ్బంది లోపలికి అనుమతించక పోవడంతో ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ మాట్లాడుతూ గురుకులాల సందర్శనలకు వెళ్లిన తమను అడ్డుకోవడం సరైంది కాదన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. పూసల ప్రణయ్, చైతన్య, చింటూ, శ్రీకాంత్,సారయ్య, అరుణ్, సాయి, లతీఫ్,రాకేష్, జగన్, వెంకటేష్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు స్వీయ రక్షణ పాటించాలి


వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో భరోసా కేంద్రం సభ్యులు

దండేపల్లి,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి):బాలికలందరు స్వీయ రక్షణ పాటిస్తూ జాగ్రత్తగా మెలగాలని వెల్గనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి సూచించారు. మంచిర్యాలకు చెందిన భరోసా సహాయక కేంద్రం ఆధ్వర్యంలో వెల్గనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం బాలికలకు అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పెద్దవాళ్లతో ఎలా మెలగాలి అనే అంశాలపై వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ సమాజ పరిస్థితులు గమనిస్తూ సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. మీకు మీరే రక్షణ పద్ధతులు పాటించాలన్నారు. భరోసా కేంద్రం సభ్యులు ప్రమీల, పద్మావతి, పుష్పలత, ఉపాధ్యాయులు రజినీ, పద్మావతి, రమాదేవి పాల్గొన్నారు.

వినియోగంలోకి క్రీడాప్రాంగణం

నాడు...



దండేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని రంగంపల్లి గ్రామ శివారులోని ఓ గుట్టపై క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. అయితే దానిని వినియోగించక పోవడంతో పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం పెరిగి నిరుపయోగంగా మారింది. ఈ విషయం గురించి ఈ నెల 4న నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు అనే కథనం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితం కావడంతో ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నాగరాజ్ ఆధ్వర్యంలో క్రీడా ప్రాంగణాన్ని ట్రాక్టర్‌తో శుభ్రం చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేడు...



ప్రభుత్వ సహకారంతో లాభాల బాటలో ఆర్టీసీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, పక్కన ఆర్టీసీ డిపో మేనేజర్ జనార్దన్

మంచిర్యాల అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నష్టాల బాటలో నడిచే ఆర్టీసీ సంస్థ కాంగ్రెస్ ప్రభుత్వ సహకారంతో లాభాల బాటలో పయనిస్తోందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ప్రజా ప్రభుత్వంలో సకల జనుల సంబురం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంస్థను లాభాల్లో నడిపించేందుకు ప్రభుత్వ సహకారం ఎంత ఉందో ఉద్యోగులు, సిబ్బంది కృషి అంతే ఉందన్నారు. గత యేడాది ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ఆర్టీసీ సంస్థ ఆర్థికంగా బలపడేందుకు దోహదం చేసిందన్నారు. డిపో పరిధిలో ఇప్పటిరకు 1.30 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. మంచిర్యాల డిపోకు గడిచిన 8 నెలల్లో రూ.8కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. బస్‌స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని డిపో మేనేజర్ జనార్దన్ ఎమ్మెల్యేకు విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన ప్రజా ప్రభుత్వం


పోస్టర్లు విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

మందమర్రి టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఆరు గ్యారంటీల పేరిట హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం వాటిని అమలు చేయడం లేదని బీజేపీ రాష్ట్ర నాయకులు ఆరుముల్ల పోషం, డీవీ దీక్షితులు పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా ఏదో సాధించామని సంబరాలు జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. పార్టీ ఇచ్చిన ఆరు అబద్ధాలను 66 మోసాలు అనే నినాదాలతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. అనంతరం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు మార్త కుమారస్వామి, రాజమల్లు, సభ్యత్వ నమోదు కన్వీనర్ శివ, మందమర్రి ఇంచార్జి సంజీవరావు, దుర్గారాజు, కట్ల తిరుపతి, రాంకిష్టయ్య, రాజేందర్, రంగు శ్రీనివాస్, పారుపల్లి శ్రీనివాస్, వంగల గణపతి, పిల్లి శంకర్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

బెల్లంపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయోత్సవాల పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని, ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని ఎంసీపీఐయూ పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బన రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్‌లు డిమాండ్ చేశారు. గురువారం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, కేసీఆర్ అప్పుల ఊబిలో రాష్ట్రాన్ని దింపాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందన్నారు. రాష్ట్రానికి నిధుల సేకరణ కావాలంటే ప్రతిపక్షాలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని, కేంద్రంలో ఉన్నప్రభుత్వంపై ప్రతిపక్షాలతో కలిసి పోరాడాలని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. నాయకులు ఆరెపల్లి రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

భీమారం, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): భీమారం, మద్దికల్, కొత్తపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం అదనపు కలెక్టర్ మోతిలాల్ పరిశీలించారు. కేంద్రాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ధాన్యం వెంట వెంటనే కొనుగోలు చేసి రైతులకు రశీదులు అందించాలన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా ధాన్యం కొనాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సదానందం ఉన్నారు.

సినిమా థియేటర్ అద్దాలు ధ్వంసం

చెన్నూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని శ్రీనివాస థియేటర్ అద్దాలను గురువారం అల్లుఅర్జున్ అభిమానులు ధ్వంసం చేశారు. బజ్జూరి వినయ్, అతడి స్నేహితులు పుష్ప2 సినిమా ప్రదర్శించాలని థియేటర్ యజమాని రాజమల్లగౌడ్‌ను కోరారు. థియేటర్ మరమ్మతు కారణంగా మూసివేసినట్లు వారికి తెలిపారు. కోపోద్రిక్తుడైన వినయ్, అతని స్నేహితులు థియేటర్ యజమానిని దుర్భాషలాడుతూ థియేటర్‌పై రాళ్లతో దాడి చేశారు. థియేటర్ యజమాని ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.